# * * సోమరి సుందరం * *

రచన:- జి. రామలక్ష్మి. హైదరాబాదు-26

ఒక ఊళ్ళో ఒక వర్తకుడున్నాడు. అతని పేరు రామయ్య. అతని భార్యపేరు సీతమ్మ. వారికి చాలా కాలానికి లేకలేక ఒక కొడుకు పుట్టాడు. వాడు చాలా అందంగా వుండటమువలన వాడికి సుందరం అని పేరుపెట్టారు.

లేకలేక కలిగిన బిడ్డ అవటమువలన సుందరంని ఆ దంపతులు చాల గారాబంగా పెంచేవారు. సుందరం పెరిగి పెద్దవాడయ్యాడు. యుక్తవయసు వచ్చింది. కానీ గారాబంగా పెరగడంవలన సోమరి తనానికీ, పెంకితనానికీ బాగా అలవాటుపడ్డాడు. తండ్రికి ఏ విధంగానూ పనిలో సహాయపడేవాడు కాదు. అతని సోమరితనానికీ, పెంకితనానికీ అంతా అసహ్యించుకునేవారు. చివరికి అందరూ అతన్ని 'సోమరి సుందరం' అని పిలిచేవారు.

వాణ్ణి మంచిమార్గంలో పెట్టాలని రామయ్య, సీతమ్మ ఎంతో ప్రయత్నించారు. కాని ప్రయోజనం లేకపోయింది. నయానా, భయానా చెప్పి చూశారు. అయినా తన పెంకితనం మానలేదు.

చివరికి విసుగువచ్చి ఒకరోజు రామయ్య సుందరంపై చెయ్యిచేసుకున్నాడు. అప్పుడు సుందరం బాధపడి ఎవ్వరికీ చెప్పకుండా యింట్లోంచి వెళ్ళిపోయాడు.

ఇంట్లోనుంచి వెళ్ళిపోయాడేగాని సుందరంకి జీవించే మార్గం తెలియదు. డబ్బు సంపాదించే మార్గం అసలే తెలియదు. ఎన్నిరోజులని ఆకలికి ఆగగలడు? ఇంటికిపోవటానికేమో మనస్కరించడం లేదు. సుందరం ఒక చెట్టుకింద కూర్చుని బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు.

ఎక్కడయినా జీతానికి కుదరవలెనని అనుకున్నాడు. తిరిగి తిరిగి ఒక లక్షాధికారి యింట్లో పని కుదుర్చుకున్నాడు.

ఆ లక్షాధికారి పరమ పిసినిగొట్టు. రెండు పూటలా అన్నంపెట్టి, సంవత్సరానికి పది రూపాయలు యిచ్చి, ఒక జత బట్టలు పెడతానన్నాడు. దానికి సుందరం సంతోషంగా ఒప్పుకున్నాడు

అంతేకాదు, ఆ జమిందారు ఒక షరతు పత్రము కూడా పెట్టాడు. అదేమిటంటే, ఏ కారణము చేతనయినా సుందరం పనినుంచి వెడలిపోయినగాని, లేక యజమానే వానిని పనినుండి తొలగించినగాని కోడిగ్రుడ్డంత బంగారం ఇచ్చి ఆ పనిని విడవవలెను.

సుందరం ముందూవెనకా ఆలోచించకుండా పని దొరికిందే చాలనుకుని, ఆ జమిందారుతోపాటు తానుకూడా పత్రముపైన సంతకం పెట్టాడు. ఆ రోజునుంచే జమిందారు సుందరంకి పట్టెడన్నంపెట్టి పుట్టెడు పనులు చేయించుకోవటం ఆరంభించాడు.

ప్రతీరోజూ తెల్లవారకుండానే లేచి, చిల్లు బింది నిండా నీళ్ళు తోడాలి. ఇంటిచుట్టూ వున్న సావిడిఅంతా తుడిచి, చెట్లకు నీరు పోయాలి. పుట్టెడు వడ్లను దంచాలి. పూరుకునేవరకూ పిల్ల వాడ్ని ఎత్తుకోవాలి. గేదెలను పొలిమేరలో తిప్పు కుని రావాలి. ఏడు కట్టెలకట్టిన మోపు మోసుకు రావాలి.

గారాబంగా పెరిగిన సుందరం ఇన్నిపనులు చేయలేకపోయేవాడు. ఎలాగో ఒక నెల గడిచింది. ఏనుగులా వుండే సుందరం పీనుగులా తయార య్యాడు. చివరికి ఒకరోజు ఆ బాధలన్నీ పడలేక ఎలాగో, తన అవస్థనుగూర్చి తండ్రికి తెలియపరి చాడు.

కొడుకు స్థితికి రామయ్య, సీతమ్మ చాలా బాధపడ్డారు. వెంటనే రామయ్య సుందరం పని చేస్తున్న ఇల్లు కనుక్కొని వెళ్ళి, కొడుకుని కలుసు

కున్నాడు. తండ్రినిచూసి సుందరం అంతాచెప్పి, బాధపడ్డాడు.

"బాధపడకు నాయనా! ఎలాగైనా నిన్ను యీ ఊబినుంచి రక్షిస్తాను. ఇప్పుడే న్యాయాధికారితో చెప్పివస్తాను. అందాకా నువ్వు కాస్తఓపిక పట్టు" అని కొడుక్కి ధైర్యంచెప్పాడు.

తరువాత రామయ్య న్యాయాధికారి వద్దకు వెళ్ళి జరిగిందంతా చెప్పాడు.

జమిందారు సంగతి ముందే తెలిసిన న్యాయాధికారి రామయ్యకు ధైర్యం చెప్పి, "నువ్వేం బాధపడకు. నీ కొడుకుసంగతి నేను చూసుకుంటాను. నువ్వు వెళ్ళు." అన్నాడు.

రామయ్య న్యాయాధికారికి నమస్కరించి వెళ్ళిపోయాడు.

తరువాత న్యాయాధికారి జమిందారును, సుందరంనీ పిలిపించాడు. ఇద్దరూ వచ్చారు. జమిందారుతో సుందరం కోసం వాళ్ళ నాన్న వచ్చాడని అంచేత సుందరంని వదిలేయమని చెప్పాడు.

జమిందారు అందుకు ఒప్పుకోలేదు. వాళ్ళు రాసుకున్న పత్రము గురించి చెప్పి, దానిప్రకారం జరిపించితే వదులుతానన్నాడు.

"సరే, మీరు వెళ్ళండి." అన్నాడు జమిందారుని న్యాయాధికారి.

జమిందారు వెళ్ళిపోయాడు.

తర్వాత న్యాయాధికారి సుందరంని పిలిచి, చెవిలో ఏదో చెప్పాడు.

సుందరం అంతా జాగ్రత్తగా విన్నాడు.

"ఈ విధంగా చేశావంటే, నిన్ను ఆయన పనిలోనుండి తప్పక తీసేస్తాడు. అంతగా అతను నిన్ను బాధించినట్లయితే, వెంటనే వచ్చి నాతో చెప్పు. తర్వాత నేను చూసుకుంటాను." అన్నాడు న్యాయాధికారి.

"అలాగేనండి." అన్నాడు సుందరం.

"ఇక వెళ్ళి నీ పని చూసుకో" అని సుందరాన్ని పంపేశాడు.

మరునాడు సుందరం జమిందారు వచ్చి లేపేవరకూ లేవలేదు. లేచి సావిడంతా చిందర వందరగా తుడిచి, చెట్లకు ఒక్క చెంబుడే నీరు పోశాడు. పిల్లవాణ్ణి గిల్లి ఏడిపించసాగాడు. పొలిమేరకు గేదెలను తోలుకుపోయి. వాటినక్కడే వదిలేసి వచ్చాడు. ఏడు మోపులకు బదులు ఏడు కట్టలనే పట్టుకువచ్చాడు. ఈ విధంగా న్యాయాధికారి చెప్పినట్లుగానే చేశాడు.

వాడి పనిని చూసి జమిందారుకి పట్టరానంత కోపంవచ్చి, "ఇదేమిటిరా? ఇవాళ అన్నిపనులూ ఇలాచేశావు?" అన్నాడు.

"ఇంకెలా చెయ్యాలి? మీరు యిచ్చే ముష్టి పదిరూపాయలకు యీ పని చాలు. ఇంతవరకూ చేయించుకున్నది చాల్లెండి. కావాలంటే ఎవరి నయినా న్యాయం అడగండి. వాళ్ళే చెపుతారు." అన్నాడు సుందరం ధైర్యంగా.

"ఎంత పొగరురా నీకు! నా ఉప్పుతింటూ నాకే ఎదురుసమాధానం చెప్తావా?" అంటూ కర్ర తీసుకుని నాలుగుదెబ్బలు వేశాడు.

సుందరం ఏడుస్తూ న్యాయాధికారి ఇంటికి వెళ్ళి జరిగిందంతా చెప్పాడు.

న్యాయాధికారి జమిందారును పిలిపించాడు.

"ఏమయ్యా! కుర్రవాణ్ని ఎందుకు ఇలా కొట్టావు?" అనడిగాడు.

జమిందారు సుందరంమీద అనేక నిందలు మోపి చెప్పాడు.

"మీరు రాసుకున్న పత్రములో మీరు కొడితే దెబ్బలుతినాలని రాసిలేదు. వాడికి ఇష్టం

లేకపోతే వాడు పోవాలి. మీకు ఇష్టంలేకపోతే మీరు వెళ్ళిపొమ్మనాలి. అనే రాసుకున్నారు. కాని ఇలా కొడతారా?" అన్నాడు న్యాయాధికారి.

అక్కడ చేరినవారంతా జమిందారును నానా విధాలుగా అడగసాగారు.

దానికి జమిందారు, "నాదగ్గర పనిచేస్తూ, నా ఉప్పుతింటూ నన్నే ఎదిరిస్తున్నాడు. ఇలాంటి వాడు నా యింట్లో పని చేయనవసరం లేదు." అన్నాడు.

వెంటనే సుందరం, "అయితే మీరే నన్ను పనిలోనుంచి పొమ్మంటున్నారు కాబట్టి, మీరే నాకు కోడిగ్రుడ్డంత బంగారం యివ్వాలి." అని అడిగాడు.

అక్కడ వున్నవారంతా, "అవును. మీరే సుందరంకి బంగారం యివాలి." అన్నారు.

న్యాయాధికారికూడా జమిందారును సుందరంకి బంగారం చెల్లించవలసిందిగా చెప్పాడు.

జమిందారు చేసేదిలేక సుందరంకు కోడి గ్రుడ్డంత బంగారం చెల్లించాడు.

రామయ్య సంతోషించి, న్యాయాధికారికి నమస్కరించి సుందరాన్ని తీసుకుని వెళ్లిపోయాడు.